# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-03-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశంలో 45 శాతానికిపైగా స్టార్టప్‌లకు మహిళలే నేతృత్వం వహిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో స్టార్టప్ మహాకుంభ్‌ను ఈరోజు ఆయన ప్రారంభించారు.**

**2. తెలంగాణ ఇన్‌ఛార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ ఈరోజు బాధ్యతలు చేపట్టారు.**

**3. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన సన్నాహక ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సంబంధిత అధికారులతో సమీక్షించారు.**

**4. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్రంలో బస్సు యాత్ర చేపట్టనున్నారు.**

**5. ఝార్ఖండ్ నుంచి కోస్తా ఒడిస్సా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈరోజు, రేపు ఉత్తర, దక్షిణకోస్తాంధ్రలో కొన్నిచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

దేశంలోని 45 శాతానికిపైగా స్టార్టప్‌లకు మహిళలే నేతృత్వం వహిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలోని భారత్ మండపంలో స్టార్టప్ మహాకుంభ్ ను ఈరోజు ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన తిలకించారు. స్టార్టప్ మహాకుంభ్‌కు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ అపూర్వ శక్తి, ప్రకంపనలు సృష్టించే కార్యక్రమంగా స్టార్టప్ మహాకుంభ్‌ను అభివర్ణించారు. స్టార్టప్ మహాకుంభ్‌ను సందర్శించే ఏ భారతీయుడైనా భవిష్యత్తు యూనికార్న్‌లు, డెకాకార్న్‌లను చూస్తారని చెప్పారు. స్టార్టప్ అనేది ఒక సామాజిక సంస్కృతిగా మారిందని అన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం అవుతుందని చెప్పారు. అంతర్జాతీయ అంశాలపై భారతీయ పరిష్కారాలు ప్రపంచంలోని అనేక దేశాలకు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

--------------------------

తెలంగాణ ఇన్‌ఛార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో హైకోర్టు చీఫ్ జస్టిస్ లోక్ ఆరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు

పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం.. ఇంఛార్జి గవర్నర్ రాధాకృష్ణన్ తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ప్రస్తుతం జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్, తెలంగాణకు ఇన్‌ఛార్జి గవర్నర్‌గా, అలాగే పుదుచ్చేరికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

---------------------------

రానున్న సాధారణ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సన్నాహాక ఏర్పాట్లుపై వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్. జవహర్ రెడ్డి డిజిపి కెవి. రాజేంద్రనాధ్ రెడ్డి,సిఇఒ ముఖేష్ కుమార్ మీనాలతో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సైబర్ సెక్యూరిటీ,ఐటి,స్వీప్, శాంతి భద్రతలు,సెక్యురిటి, కమ్యునికేషన్ ప్లాన్, కంప్లైంట్ రిడ్రస్సల్, ఓటరు హెల్ప్ లైన్, పోలింగ్ కేంద్రాల్లో కనీసం సౌకర్యాలు వంటి అంశాలపై సమీక్షించారు. ఈసమావేశంలో డిజిపి కెవి రాజేంద్ర నాధ్ రెడ్డి,సిఇఓ ముకేశ్ కుమార్ మీనా, వివిధ ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీల అధికారులు పాల్గొన్నారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్రంలో బస్సు యాత్ర చేపట్టనున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. 'మేమంతా సిద్ధం' పేరిట చేపట్టే బస్సు యాత్ర వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమై ఉత్తరాంధ్ర వరకు కొనసాగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రలో ప్రతి రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి , సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు నియోజకువర్గాలు మినహా మిగిలిన నియోజకవర్గాలన్నింటిలోనూ బస్సు యాత్ర జరుగుతుందున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు జగన్‌మోహన్ రెడ్డి విరామం లేకుండా పూర్తిగా యాత్రలోనే ఉంటారని, పండుగలు, సెలువుల్లో సైతం యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత మలివిడత ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు.

---------------------------

భారత్, అమెరికా మధ్య రక్షణ బంధం మరింత బలోపేతం కానుందని భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి చెప్పారు. పసిఫిక్ సముద్రజలాల్లో అన్ని దేశాలూ స్వేచ్ఛాయుత వాణిజ్య కార్యకలాపాలు సాగించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో భారత్, అమెరికా త్రివిధ దళాల ఆధ్వర్యంలో టైగర్ ట్రయాంఫ్-2024 యుద్ధ విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఐఎన్ఎస్ జలాశ్వా యుద్ధనౌక పై నిన్న ఇరుదేశాల ప్రతినిధులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్ గార్సెట్టి మాట్లాడుతూ సాగర జలాల సరిహద్దుల్లో చొరబాట్లు, సముద్రపు దొంగల ఆట కట్టించేందుకు భారత్‌తో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. తూర్పు నౌకాదళాధిపతి, వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ టైగర్ ట్రయంఫ్ విన్యాసాల్లో భాగంగా హార్బర్ ఫేజ్‌లో విపత్తు, యుద్ధ సమయంలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించుకోనున్నట్టు తెలిపారు. ఈనెల 29న కాకినాడలో మెడికల్ రిలీఫ్ క్యాంపుతో పాటు.. సంయుక్త యుద్ధ విన్యాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

---------------------------

జార్ఖండ్ నుంచి కోస్తా ఒడిస్సా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈరోజు, రేపు ఉత్తర

కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. మరోవైపు రాయలసీమ జిల్లాల్లో వేడి, ఉక్కపోత వాతావరణం ఉంటుందని వెల్లడించింది. నేడు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములతో కూడిన వర్షం పడేపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కులీలు, పశువుల, గొర్రెల కాపరులు చెట్ల కింద , బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని.. సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

--------------------------

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడంలో ఎలాంటి పక్షపాతం వుండబోదని, పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తామని విశాఖ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున రాజకీయపక్షాలకు విజ్ఞప్తిచేశారు. ఉడా చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నామినేషన్లు- ఇతర ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లిఖార్జున మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసేవరకూ జిల్లాలో పూర్తి స్థాయిలో ఎన్నికల నిబంధనలు అమలవుతాయన్నారు..ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లు పాల్గొనేందుకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సినిమా థియేటర్లు, టీవీ ఛానళ్లు, కేబుల్ టీవీల్లో రాజకీయ పార్టీలు జారీ చేసే ప్రచార ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్-పర్యవేక్షణ కమిటీ-ఎంసిఎంసి నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. ఇంతకుముందే మొదలై, కొనసాగుతున్న ప్రకటనలకు సైతం తాజాగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోస్టర్లు, ఫెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులను తొలగించినట్లు తెలిపారు.

--------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలు నేటి నుంచి ఈనెల 24వతేదీ వరకు జరుగనున్నాయి. ఈరోజు రాత్రి 7గంటల నుంచి 8 గంటల వరకు పుష్కరిణిలో సీత, లక్ష్మణ, ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రేపు రాత్రి రుక్మిణీ సమేత క్రిష్ణస్వామిగా, 22, 23, 24 తేదీలలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిగా భక్తులకు దర్శనవమిస్తారు. తెప్పోత్సవాల కారణంగా నేటి నుంచి 24వతేదీ వరకు సహస్రదీపాలంకరణసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది.

--------------------------

గ్రామ,వార్డు వాలంటీర్లను ఎన్నికల విధుల్లో వినియోగించరాదని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ నుంచి వార్డు వాలంటీర్లను దూరంగా ఉంచాలనే ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లను అనుమతించొద్దంటూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఈ ఆదేశాలను పంపించాలని అధికారులకు సూచించారు.

---------------------------

అకాల వర్షాలు, వడగళ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పంటనష్టం అంచనా వేయాలని వ్యవసాయశాఖను ఆదేశించింది. వచ్చే రెండుమూడు రోజులు కూడా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో అప్పటివరకు జరిగే మొత్తం నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం ఇస్తామని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. అకాల వర్షాలు, వడగళ్లు, ఈదురుగాలులకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. వరి, మొక్కజొన్న, జొన్న, పొగా కు, వేరుశనగ, మిర్చి, కూరగాయలు, బొప్పాయి, ఉల్లి పంటలు దెబ్బతిన్నాయి.

======================